

తాపడం పనులకు రూ.5 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మల్లేశ్వర స్వామి ఆలయ బంగారు తాపడం పనులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ.5 లక్షలు విరాళం అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5,600, గరిష్ట ధర రూ.8,500, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

కలిమిశ్రీకి సాహితీ తపస్వి పురస్కారం



విజయవాడ కల్చరల్: కవి, రచయిత కె.సాంబశివరావు (కలిమిశ్రీ) పద్మభూషణ్ జామువా సాహితీ తపస్వి పురస్కారానికి ఎంపికయ్యారు. కలిమిశ్రీకి పలువురు రచయితలు, కవులు అభినందనలు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
బాపట్ల	6:27	4:38
నరసరావుపేట	6:29	4:37
గుంటూరు	6:27	4:38

న్యూస్‌రీల్

ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీ గురుకుల ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోస్తాంధ్రలోని తొమ్మిది జిల్లాల వారీగా ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు పాత గుంటూరు నందివెలుగురోడ్డులో నిర్వహిస్తున్న ఏపీఆర్ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఇంగ్లిష్ మీడియంలో చేరేందుకు ఆసక్తి గలవారు ఏపీఆర్‌జేసీ సెట్‌తో సంబంధం లేకుండా ఈనెల 24లోపు httpr://aprr.apcfrr.in/ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడంతో పాటు ముస్లిం, మైనార్టీగా నమోదైన ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు నందివెలుగురోడ్డులోని కళాశాలలోగానీ, 9701451826, 9849559611 నంబర్లలోగానీ సంప్రదించాలని సూచించారు.

బ్యాక్‌లాగ్ పోస్టులకు 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 54 ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాక్ పోస్టులకు సంబంధించి ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్, జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గతంలో దరఖాస్తుకు ఆఖరు తేదీ 11వ తేదీ వరకు మాత్రమే ఉండగా, అభ్యర్థుల కోరిక మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును 11 నుంచి 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్‌పై ప్రత్యేక డ్రైవ్



జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: జిల్లాలో ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో పోలీసు అధికారులను ఆదేశించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిని, నెంబరు ప్లేట్‌లేని వాహనదారులను, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించి, చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

యార్డుకు 1,36,551 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,36,551 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,29,938 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 94,559 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1016 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 90 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 78 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 0 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 0 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 420 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

ఆక్వాకు చేయూత

- రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం
- పదెకరాలలోపు రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే
- జిల్లాలో 2620 సర్వీస్‌లకు సబ్సిడీ విద్యుత్
- తీరప్రాంత రైతులకు లబ్ధి
- ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఆనందంలో ఆక్వా రైతులు



సాగులో ఉన్న ఆక్వా చెరువులు

సాక్షిప్రతినిధి, బాపట్ల: ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా...అన్నదాతలను ఆదుకునే విషయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెనుకంజ వేయటం లేదు. రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు కష్ట, నష్టాలను పక్కకు నెట్టి ముందుకు సాగుతుంది. ఇదే క్రమంలో ఆక్వా రైతులకు చేయూత నిచ్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా వారికి యూనిట్ విద్యుత్ రూ.1.50 పైసలకే అందిస్తుంది. ఒక్కో యూనిట్‌పై రూ.5.50 పైసల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంతో రైతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నారు.

బాపట్ల జిల్లాలో..

బాపట్ల జిల్లాలో ఆక్వాకు సంబంధించి 3435 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. చంద్రబాబు పాలనలో నామమాత్రంగా కూడా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చిన పాపాన పోలేదు. పాదయాత్రలో భాగంగా ఆక్వా రైతుల కష్టాలు స్వయంగా అప్పటి ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.50 పైసలకే యూనిట్ విద్యుత్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కాగానే ఆ హామీని నెరవేర్చారు. తొలుత జిల్లాలో 743 విద్యుత్ సర్వీస్‌లకే యూనిట్ విద్యుత్ రూ.1.50 పైసలకు అందించారు. ఆ తర్వాత 1870 సర్వీస్‌లను కలిపి మొత్తం 2620 సర్వీస్‌లకు సబ్సిడీ విద్యుత్‌ను అందిస్తోంది. ఇంకా 815 సర్వీస్‌లు మాత్రమే ఆక్వా పరిధిలో ఉండగా, వాటిని కూడా సబ్సిడీ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సదరు రైతుల సర్వీస్‌లను యూనిట్ రూ.1.50 పైసల పరిధిలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు అధికారులు రైతులకు సమాచారం అందించారు. వీటికి కూడా సబ్సిడీ విద్యుత్‌ను అందించనున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 95 శాతానికి పైగా సర్వీస్‌లకు రూ.1.50 పైసల విద్యుత్ అందుతుంది. 10 ఎకరాలలోపు ఉన్న రైతులందరికీ ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోంది. ప్రభుత్వ, డీకేటీ, అసైన్డ్ భూముల పరిధిలోని ఆక్వా రైతులకు సైతం ప్రభుత్వం సబ్సిడీ విద్యుత్‌ను అందిస్తోంది.

చంద్రబాబు హయాంలో పట్టించుకోని వైనం

చంద్రబాబు పాలనలో ప్రభుత్వం ఆక్వా రైతుల కష్టాలను పట్టించుకోలేదు. నామమాత్రంగా కూడా రైతులకు సబ్సిడీ విద్యుత్‌ను ఇవ్వలేదు. ఒక్కో యూనిట్ రూ.3.86 పైసలతోపాటు సర్వీస్ ఛార్జీలను కలిపి రూ.4 చొప్పున రైతుల ముక్కుపిండి వసూలు చేశారు. ప్రభుత్వ, డీకేటీ, కౌలు రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వలేదు. ఐదెకరాలలోపు రైతులకు మాత్రమే అరకొరగా విద్యుత్‌ను అందజేశారు. పైగా 20 హెచ్‌పీ మోటరుకే సబ్సిడీ విద్యుత్ అంటూ కొర్రీలు పెట్టారు. దీంతో ఇచ్చిన సబ్సిడీతో ఎకరం కూడా సాగుచేయలేని పరిస్థితి. విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు రూ.4 కావడంతో రైతులకు ఆక్వాసాగు భారంగా మారింది. ఒక్క కేజీ రొయ్యలు సాగు చేసేందుకు రూ.40 నుంచి 50 విద్యుత్‌ఛార్జీ అయ్యేది.

వైఎస్ జగన్ వచ్చాక..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక వైపు యూనిట్ విద్యుత్‌ను రూ.7లకు కొనుగోలు చేస్తూ రైతులకు రూ.1.50 పైసలకు అందిస్తూ ఆక్వా రైతుల పట్ల తనకున్న ప్రేమను చాటుకుంది. ఒక కేజీ రొయ్యల ఉత్పత్తికి రూ.15 ఖర్చు వస్తుంది. చంద్రబాబు హయాంతో పోలిస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యుత్ చార్జీలు తగ్గడంతో ఒక్క కేజీ పైన రూ.35 ఆదా అవుతుంది. టన్నుకు రూ.35 వేలు మిగులుతుంది. ఆక్వాసాగు ఖర్చులు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో వైఎస్ జగన్ ప్రభుత్వం సబ్సిడీ విద్యుత్‌ను అందించడం రైతులకు మరింత ఉపశమనంగా మారింది.

విద్యుత్ సబ్సిడీతో...

బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం నుంచి నెల్లూరు జిల్లా కావలి వరకు తీరప్రాంత రైతులకు విద్యుత్ సబ్సిడీ మరింత ఉపయోగకరంగా మారింది. కావలి ప్రాంతంలో 20వేల ఎకరాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 30 వేల ఎకరాలు, బాపట్ల, రేపల్లె ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున ఆక్వాసాగు ఉంది. ఇవన్నీ తీరప్రాంత భూములు. ఇసుక,ఉప్పు నేలలు కావడంతో పంటల సాగుకు అనుకూలంగా లేవు. డికేటి, ప్రభుత్వ అసైన్డ్‌భూములు అధికంగా ఉన్నాయి. పనికిరాని భూముల్లో ఆక్వా సాగు చేపట్టాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకే సాగు జరుగుతుంది. సబ్సిడీ వలన 95శాతానికి పైగా రైతులు లబ్ధిపొందుతున్నారు.

ఆక్వా రైతులు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50 విద్యుత్‌ను అందించడం చాలా సంతోషంగా ఉంది. దీని వలన కష్టాల్లో ఉన్న ఆక్వా రైతులకు మరింత ఉపశమనం లభించనుంది. సబ్సిడీతో ఒక్క కిలో రొయ్యల ఉత్పత్తి వలన రూ.35 ఆదా అవుతుంది. టన్నుకు రూ.35 వేలు మిగులుతున్నట్లే లెక్క. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం సబ్సిడీ విద్యుత్ ఇచ్చి రైతులను ఆదుకోవడంపై రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతున్నాం.

– దుగ్గినేని గోపీనాథ్, ఆక్వా రైతుల సంఘం కన్వీనర్

సబ్సిడీతో రైతులకు ఊరట



సబ్సిడీ విద్యుత్ ఇచ్చి ఆక్వా రైతులను సీఎం జగన్ ఆదుకున్నారు. నేను పదెకరాలలో రొయ్యల సాగు చేస్తున్నా. రొయ్యల చెరువులకు నాలుగు విద్యుత్ మీటర్లు ఉన్నాయి. ఆక్వా సాగుకు సరఫరా చేసే విద్యుత్‌కి యూనిట్‌కి రూ.4 వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం సీఎం జగన్ పదెకరాల వరకు యూనిట్‌కు రూ.1.50లకే సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క మీటర్‌కి నెలకి సుమారుగా 3వేల యూనిట్ల విద్యుత్ వాడకం ఉంటుంది. రూ.4 చొప్పున 3వేల యూనిట్లకు రూ.12వేలు బిల్లు వస్తుంది. సబ్సిడీలో యూనిట్‌కు రూ.1.50 చొప్పున రూ.4,500 బిల్లు వస్తుంది. ప్రస్తుతం విద్యుత్ సబ్సిడీతో రైతులకు ఊరట కలుగుతుంది.

– చుక్కల శ్రీనివాసరావు, ఆక్వా రైతు, తుమ్మలపల్లి, కర్లపాలెం మండలం

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం చూపొద్దు

జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుకు అర్జీ అందజేస్తున్న అర్జీదారులు

బాపట్లఅర్బన్: స్పందనలో వచ్చిన అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చూపరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ ప్రాంతాల నుంచి అర్జీదారులు జిల్లా జాయింట్ కలెక్టర్ కు విన్నవించారు. కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపగా, మరికొన్నింటిని పరిశీలన, విచారణకు ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మొత్తంగా 70 అర్జీలు వచ్చాయి. అనంతరం స్పందన అర్జీలపై జిల్లా అధికారులతో జేసీ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తున్నందున స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన పోర్టల్‌లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా అధికారులు పునఃపరిశీలన చేసుకోవాలన్నారు. గడువు తీరిన అర్జీలు పెండింగ్‌లో ఉంటే అధికారులు ఇబ్బందులు పడతారని అన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుదరదని తెలిపారు. తదుపరి 294 మంది డీఎంయూ వాహనదారులకు రాష్ట్రంలోనే తొలిసారిగా గుర్తింపు కార్డులను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, సీపీఓ జి.భరత్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- చినపరిమిలో జగనన్నే మా భవిష్యత్



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

చినపరిమి (వేమూరు): ప్రజా సంక్షేమం రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చుండూరు మండలం చినపరిమి గ్రామంలో సోమవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గురించి వివరించారు. ప్రభుత్వం పనితీరుపై ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం గృహ యాజమానుల అనుమతితో ఇళ్లకు, సెల్ ఫోనులకు స్టిక్కర్లు అంటించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేశారని, అమ్మ ఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల అకౌంట్‌లో డబ్బులు జమ చేశారని తెలిపారు. సర్పంచ్ సుభాషిణి, సొసైటీ అధ్యక్షులు సాంబరెడ్డి, తుమ్మా బసివిరెడ్డి, అవుతు బ్రహ్మానంద రెడ్డి, తమ్మా పాములరెడ్డి, మోషే, పి.రాజేష్ కుమార్, అవుతు సాయిరెడ్డి, బాబిరెడ్డి పాల్గొన్నారు.

నా భర్త వల్ల ప్రాణ హాని

- స్పందనలో ఎస్పీ ఎదుట వాపోయిన బాధితురాలు
- అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చిన ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ వకుల్‌జిందాల్ ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న జి.భార్గవి కుటుంబసభ్యులు

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 29 మంది బాధితులు హాజరై తమ సమస్యలను ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఎస్పీ సంబంధిత పోలీస్‌స్టేషన్ సీఐలు, ఎస్‌ఐలతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎస్‌ఐ పట్టించుకోవడం లేదు

మేము కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాం. నాకు 2021 ఫిబ్రవరి 13వ తేదీన కొల్లూరు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన గులకారపు శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. పెళ్లి అయిన తర్వాత నా భర్త ప్రవర్తన సరిగా లేకపోవడంతో వేర్వేరుగా ఉంటున్నాం. ఈనెల 8వ తేదీన విడాకుల విషయంపై మాట్లాడుకుందాం రమ్మని పిలిచారు. నేను, మా నాన్న, మా అమ్మ వెళ్తుండగా పెసర్లంక గ్రామశివారులో దారికాచి మా బావ ఎల్లయ్య, మామ భుజంగరావు, అత్త ఉదయమ్మ, తోడికోడలు త్రివేణి, పెద్ద అత్త లీలమ్మలు తీవ్రంగా కొట్టి చంపేందుకు ప్రయత్నించారు. ఈ విషయంపై వెంటనే కొల్లూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేస్తే నేటి వరకు ఎస్‌ఐ పట్టించుకోలేదు. పైగా మమ్ములను దుర్భాషలాడారు.

–గులకారపు భార్గవి, కావూరివారిపాలెం, చీరాల మండలం

రోడ్డుపై నడిస్తే చంపుతామంటున్నారు

మండేవారిపాలెం గ్రామానికి చెందిన వీరంకి భాస్కరరావు, కంచర్ల శ్రీనివాసరావులు పంచాయతీ రోడ్డును ఆక్రమించుకొని గ్రామానికి చెందిన వ్యక్తులను అటువైపుగా వెళ్లనీయడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో అటువైపుగా వెళితే మమ్ములను చంపుతామని బెదిరిస్తున్నారు.

– గుండాల విమలాదేవి, గూడవల్లి, చెరుకుపల్లి మండలం

రమణీయం.. ఛాయాచిత్రం

- ఫొటోగ్రఫీలో రాణిస్తున్న గుంటూరు వైద్యుడు
- జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సొంతం





డాక్టర్ వెంకటరమణకు అవార్డులు తెచ్చిన ఫొటోలు



డాక్టర్ నరేంద్ర వెంకటరమణ

గుంటూరు మెడికల్: నాడి పట్టి రోగాలను నయం చేయటంలో నిత్యం బిజీగా ఉండే గుంటూరుకు చెందిన ఓ వైద్యుడు వైల్డ్ ఫొటోగ్రఫీలో అంతర్జాతీయ అవార్డు సొంతం చేసుకుని గుంటూరు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఒకపక్క జనరల్ ఫిజీషియన్‌గా రోగుల ప్రాణాలు కాపాడుతూ.. మరో పక్క అడవుల్లో సంచరించే క్రూర మృగాల కదలికలను తన కెమెరాతో క్లిక్‌మనిపించి బ్రిటిష్ రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ వారి ఏఆర్‌పీఎస్ ఫెలోషిప్‌ను అందుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా 22 ఎంట్రీలు ఈ ఫెలోషిప్‌కు పోటీపడగా కేవలం నాలుగు మాత్రమే సొసైటీ ఆమోదం పొందాయి. వాటిలో భారత దేశం నుంచి ఫెలోషిప్ పొందిన ఏకైక వ్యక్తిగా డాక్టర్ నరేంద్ర వెంకటరమణ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఏఆర్పీఎస్ ఫెలోషిప్ అందుకున్న ఏకైక వ్యక్తిగా డాక్టర్ వెంకటరమణ రికార్డు సృష్టించారు.

ఏడేళ్లుగా కెమెరాతో గురి..

డాక్టర్ నరేంద్ర వెంకటరమణ మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అడవుల్లో రాయల్ బెంగాల్ టైగర్‌పై చిత్రీకరించిన డాక్యుమెంటరీకి అంతర్జాతీయ అవార్డు లభించింది. డాక్టర్ వెంకటరమణ ఏడు సంవత్సరాలు మూడు తరాలకు చెందిన 80 పులుల ఫొటోలు తీసి అంతర్జాతీయ పోటీలకు పంపించగా, న్యాయ నిర్ణేతలు ఆ ఫొటోలకు మంత్ర ముగ్ధులై ఆయనకు సాహస ఫొటోగ్రఫీకి అవార్డు ప్రకటించారు. డాక్టర్ వెంకటరమణ గత 15 ఏళ్లుగా వన్య ప్రాణుల ఛాయాచిత్రాలు తీసేందుకు ఆఫ్రికా, కెన్యా, టాంజానియా దేశాలతో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లోని వన్య ప్రాణుల కేంద్రాలను సందర్శించి, జంతువుల జీవన విధానం, వివిధ దశల్లో వాటి పెరుగుదల, కలిసి మెలిసి జీవించే దృశ్యాలు, వేటాడే దృశ్యాలు తీశారు.

చిన్ననాటి నుంచే ఆసక్తి..

డాక్టర్ నరేంద్ర వెంకటరమణ తండ్రి డాక్టర్ గోపాలరావు రైల్వేలో మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనకు ఫొటోగ్రఫీ అంటే ఆసక్తి. దీంతో ఒక పక్క తండ్రి మాదిరిగా వైద్యుడు అవ్వాలనే లక్ష్యంతో డాక్టర్ కోర్సు అభ్యసిస్తూనే 2000 సంవత్సరం నుంచి ఫొటోగ్రఫీలో సైతం మెలకువలు నేర్చుకున్నారు. కర్నాటకు చెందిన డీఎస్‌పీ పెరుమాళ్, కేరళ రాష్ట్రానికి చెందిన ప్రవీణ్ మోహన్‌దాస్‌ల వద్ద శిష్యుడిగా చేరి వైల్డ్ ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్చుకున్నాడు. ఏడాదికి ఒకసారి ప్రకృతితో మమేకం అయ్యేందుకు అడవులకు వెళ్లి జంతువులు, పక్షుల ఫొటోలను తన కెమెరా కళ్లతో బంధిస్తున్నారు. చేతితో చిత్రాలు గీసే కల్చర్ ఆర్ట్‌లో కూడా మంచి ప్రావీణ్యం సంపాదించారు. గిటారు, కీబోర్డు, డ్రమ్స్, వాయించడంతోపాటు ఫ్లూట్‌తో పలు గీతాలను ఆలపించడంతో సైతం నైపుణ్యం ఉంది.

అందుకున్న డిగ్రీలు, అవార్డులు...

ఫొటోగ్రఫీలో డాక్టర్ వెంకటరమణ నైపుణ్యాన్ని గుర్తించిన అమెరికా దేశంలోని పలు సంస్థలు డిగ్రీలను అందజేశాయి. ఇంగ్లండ్‌కు చెందిన ఏఆర్‌పీఎస్, అమెరికాకు చెందిన ఎంఐసీఎస్, ఈయూఎస్‌పీఏ, ఆస్ట్రేలియాకు చెందిన ఏఏపీఎస్, ఇండియాకు చెందిన ఏఐఐపీసీ సంస్థలు, అసోసియేట్ ఆఫ్ ఇంటర్నేషన్ కొలీగ్స్ సొసైటీ, అసోసియేట్ ఆఫ్ యునైటెడ్ స్టేట్ ఫొటోగ్రఫీ అకాడమీ, ఫెలో ఆఫ్ ఇంటర్నేషనల్ కొలీగ్స్ సొసైటీ ఫొటోగ్రఫీలో మాస్టర్ డిగ్రీలను, ఫెలోషిప్‌లను అందించాయి. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ ఢిల్లీ, కేరళ సొసైటీ బెటర్ ఆర్ట్ ఫౌండేషన్, ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ, పలు జాతీయ సంస్థల నుంచి 15కు పైగా అవార్డులను, ఇంటర్నేషనల్ యాక్సిటెన్సీ 200లకు డాక్టర్ వెంకటరమణ అవార్డు అందుకున్నారు.

ఐజీ సహకారం మరిచిపోలేం

- ప్రకాశం, బాపట్ల ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్
- ఐజీ త్రివిక్రమ వర్మ దంపతులకు ఘన సన్మానం



ఐజీ సీఎం త్రివిక్రమవర్మ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, సిబ్బంది

ఒంగోలు టౌన్: గుంటూరు రేంజ్ ఐజీగా డాక్టర్ త్రివిక్రమ వర్మ అందించిన సహకారం మరచిపోలేమని ప్రకాశం జిల్లా ఎస్పీ మలికా గర్గ్, బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. విశాఖపట్నం కమిషనర్‌గా బదిలీ అయిన డాక్టర్ త్రివిక్రమ్ వర్మ, ఆలయన సతీమణి సువర్ణవర్మను సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు, ఇరు జిల్లాల పోలీస్ అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ ఐజీ పర్యవేక్షణలో ప్రతిభావంతంగా పనిచేయగలిగామని చెప్పారు. ఆయన పరిపాలన దక్షత, కర్తవ్య నిర్వహణలో చిత్తశుద్ధి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుందన్నారు. సిబ్బంది సంక్షేమానికి తీసుకున్న చర్యలు కలకాలం గుర్తుండిపోతాయని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఐజీ తనపై చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఐజీ సహకారంతో బాపట్ల జిలాల్లో పలు కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఎలాంటి సమస్య అయినా సానుకూలంగా స్పందించి సమయస్ఫూర్తితో పరిష్కారం చూపగల సమర్థవంతమైన అధికారి డాక్టర్ త్రివిక్రమవర్మ అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు ఉత్తమ సేవలందిస్తానని తెలిపారు.

సిబ్బంది అభిమానానికి కృతజ్ఞతలు

ఇరు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు తనపై చూపిన అభిమానానికి ఐజీ త్రివిక్రమ్ వర్మ కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలతో ఉన్న అనుబంధం ఎన్నటికీ మరువలేనిదన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో నిబద్ధతతో విధులు నిర్వర్తించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలనందించి పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకిత సురానా, ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, ఇరు జిల్లాల డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతి చెందిన స్వామి

అద్దంకి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభించిన ఘటన పట్టణ శివారులోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని నల్లవాగు సమీపంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. నల్లవాగు సమీపంలోని ఓ వెంచర్‌లో వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడి తలపై గాయాలు ఉండటంతో ఎవరైనా చంపేసి ఉంటారనే కోణంలో విచారణ చేపట్టారు. మృతుడు వినుకొండ మండలం నాగులవరం గ్రామానికి చెందిన ఓరుగంటి స్వామి (34)గా గుర్తించారు. ఇతను కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామంలోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి తన బైకుపై అద్దంకి వస్తుండగా ఇలా జరిగిందని చెప్తున్నారు. స్వామిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉండవచ్చని బంధువులు భావిస్తున్నారు. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు విచారణలో వెలుగు చూడాల్సి ఉంది.

మెగా డ్రైవ్ ద్వారా 10,500 సరిహద్దురాళ్ల ఏర్పాటు

నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా భూ రీసర్వేపై మెగాడ్రైవ్ నిర్వహించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు 10,500 సరిహద్దు రాళ్లు వేయించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ అధికారులను కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, ఆయా శాఖల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పల్నాడు జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి పథకాలపై సమీక్ష చేశారు. అభివృద్ధి పనుల్లో వెనుకబడిన 10 మండలాల అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ త్వరగా చేపట్టాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. పోషకాహార పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇన్ ఫ్లూ ఎంజా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడి

మూడు లారీలు, పొక్లెయిన్ స్వాధీనం


బొల్లాపల్లి కొండ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మార్టూరు: అనుమతులు లేని ప్రాంతంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న వారిపై సోమవారం సాయంత్రం మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో అధికారులు దాడులు నిర్వహించారు. రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి జగన్నాథరావు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో సర్వే నంబర్ 526లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నారంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు నిర్వహించారు. తవ్వకాల కోసం వినియోగిస్తున్న ఒక పొక్లెయిన్‌తోపాటు మూడు లారీలను అధికారులు స్వాధీనం చేసుకొని రాత్రి 7 గంటల సమయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అక్రమ తవ్వకాలకు పాల్పడిన కోలలపూడి గ్రామానికి చెందిన గద్దల రాజేంద్రపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తవ్వకాలకు సంబంధించిన నష్ట పరిహారం ఇతర వివరాలు నివేదికను ఉన్నతాధికారులకు పంపించిన అనంతరం తెలియజేయనున్నట్లు అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. తనిఖీలో విజిలెన్స్ టెక్నికల్ అసిస్టెంట్ రాజీ నాయుడు, కోలలపూడి వీఆర్వో రవి కుమార్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడులకు అసలు నేపథ్యం ఇది..

మండలంలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన కుంచపు వీరాంజనేయులు హైకోర్టు అడ్వకేట్ వేముల బేబీరాణిలు సోమవారం బాపట్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్పీ, ఇతర మైనింగ్ అధికారులకు స్థానిక సమస్యలపై ఫిర్యాదు చేశారు. గ్రామంలో గ్రావెల్ తవ్వకాలకై చట్టపరమైన అన్ని అనుమతులు కుంచపు వీరాంజనేయులుకు ఉన్నప్పటికీ గత కొన్ని నెలలుగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహించకుండా స్థానిక పోలీస్ అధికారి అడ్డుకుంటూ ఇబ్బందులు పాలు చేస్తున్నారని వీరాంజనేయులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. అనుమతులు ఉన్నవారిని అడ్డుకుంటూ అనుమతులు లేని వారు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నా వారిని వదలి పోలీసు అధికారులు తనను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ వీరాంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో విజిలెన్స్ మైనింగ్ అధికారులు మొదట గ్రామంలో దాడులు నిర్వహించి అక్రమార్కులకు ఆటకట్టించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. నేడు గ్రామంలో భూములు సర్వే నిర్వహించి వాస్తవాలు తెలుసుకుంటామని అధికారులు తెలిపారు.

డీఎస్పీ కేసన సేవలు ఎనలేనివి


డీఎస్పీ వెంకటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే కరణం బలరాం


డీఎస్పీ వెంకటేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

- నివాళులర్పించిన ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యే కరణం బలరాం, ఎస్పీ వకుల్ జిందాల్
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

నిజాంపట్నం: పోలీస్ శాఖకు డీఎస్పీ కేసన వెంకటేశ్వరరావు అందించిన సేవలు ఎనలేనివని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. నిజాంపట్నం మండలం అచ్యుతపురం గ్రామానికి చెందిన కేసన వెంకటేశ్వరరావు(58) పోలీస్ శాఖలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తూ ఈనెల 8వ తేదీ రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం అచ్యుతపురం గ్రామంలో డీఎస్పీ కేసన వెంకటేశ్వరరావు మృతదేహాన్ని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సందర్శించి నివాళులర్పించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ డీఎస్పీ కేసన వెంకటేశ్వరరావు మృతి ఎంతో బాధాకరమని అన్నారు. పోలీస్ శాఖకు ఆయన అందించిన


డీఎస్పీ కేసన వెంకటేశ్వరరావు(ఫైల్)

సేవలు మరువలేనివని అన్నారు. ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మృతదేహాన్ని పలువురు పోలీస్‌శాఖ అధికారులు, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

కర్షకులకు సీఎం జగన్ వెన్నుదన్ను


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్

పట్నంబజారు(గుంటూరు): దేశానికి రైతే వెన్నుముక అని, అటువంటి రైతుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం 'జగనన్న పాలనలో రైతు సంస్కరణలు' అనే అంశంపై పార్టీ రైతు, కార్మిక, సేవాదళ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఓం ప్రకాష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. డొక్కా మాట్లాడుతూ తన చుట్టూ ఉన్న సమాజం కోసం ఆరుగాలం కష్టించి ప్రతి ఒక్కరి శ్రేయస్సు కోరుకునేవాడే రైతు అని, రైతు సేవ వెలకట్టలేనిదన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమ పాలన సాగుతోందన్నారు. మహానేత వైఎస్సార్‌ను స్ఫూర్తిగా తీసుకుని సీఎం జగన్ రైతుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. దేశానికి ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడల్లా రైతు త్యాగంతోనే దేశ ఆర్థిక వ్యవస్థ నిలబడుతోందన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గుంటూరు, కృష్ణా జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు ధర కల్పించి రైతుభరోసా కేంద్రాల ద్వారా తాను ఉన్నాననే ధైర్యం కలిపించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందన్నారు. వ్యవసాయ రంగానికి ఆర్థికంగా పెద్ద పీట వేస్తూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతు విభాగాన్ని మరింత బలో పేతం చేయాలని, రైతుల సమస్యలు తెలుసుకుని అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, వా రికి కూడా రుణాలు అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతోందన్నారు. రైతుకు ఎంత మేలు చేసినా అది తక్కువేనని స్పష్టం చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఆవిష్కరించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కె.నరసింహారావు, వైఎస్సార్‌సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు ఆవుల సుందరరెడ్డి, సాంబశివరావు, మురళి, పెరికల కృష్ణమోహన్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిప్పారెడ్డి రామకృష్ణారెడ్డి, పిల్లి మేరి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లీ.. కల్పవల్లీ..

- నేడు కొండపాటూరులో తిరునాళ్ల
- వాహనాల రాకపోకలపై ఆంక్షలు

కొండపాటూరు(కాకుమాను): కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్లకు గ్రామం సుందరంగా ముస్తాబైంది. ఏటా రబీ వ్యవసాయ పనులు పూర్తయిన తరువాత వచ్చే తిరునాళ్ల కావడంతో ఈ జాతరకు విశిష్టత ఉంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారు. మంగళవారం తిరునాళ్లను భారీస్థాయిలో నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సందర్శకుల ఆహ్లాదం కోసం రంగుల రాట్నాలు, జెయింట్‌వీల్స్ ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా దేవస్థానం చుట్టూ చలువ పందిళ్లు వేసినట్లు ఆలయ చైర్మన్ రామినేని నాగవేణి తెలిపారు. పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. వాహన రాకపోకలపై ఆంక్షలు విధించినట్టు వివరించారు.


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి

నేడు చెన్నకేశవుని దివ్య రథోత్సవం


శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి


ఉత్సవానికి సిద్ధంగా ఉన్న రథం

మాచర్ల: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దివ్య రథోత్సవం మంగళవారం జరగనుంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న చారిత్రక ఆలయం కావటంతో ఈ రథోత్సవానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఉత్సవం కోసం స్వామి రథాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఐ.సాంబయ్య, ధర్మకర్త సుంకె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగే రథోత్సవంలో ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల రీజినల్ కన్వీనర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొననున్నారు.

జిల్లాను సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

- బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాంసుందర్
- ఘనంగా సంఘం ప్రథమ వార్షికోత్సవం


బాపట్ల జిల్లా రచయితల సంఘం నాయకులు

బాపట్ల: జిల్లాలోని ప్రతి నియోజకవర్గాన్ని సాహిత్య, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు బాపట్ల జిల్లా రచయితల సంఘం తన వంతు కృషి చేస్తుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యాంసుందర్ అన్నారు. సంఘం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రథమ వార్షిక సమావేశం సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రచయితలందరూ ఈ బృహత్కర కార్యక్రమంలో పాలుపంచుకుని తమ వంతు భాగస్వామ్యం అందించాలని అన్నారు. త్వరలో స్త్రీ పర్వం అనే కవితా సంకలనాన్ని వెలువరించనున్నట్లు తెలిపారు. బాపట్ల జిల్లాకు చెందిన ప్రముఖ కవయిత్రుల కవితలను సేకరించి, ఈ సంకలనాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ముందుగా రచయితల సంఘం ప్రధానకార్యదర్శి నందిరాజు విజయ్‌కుమార్ రచించిన బాపట్ల కీర్తి ప్రతిష్టలను తెలియజేసే బాపట్ల ప్రాభవం అనే పద్యానికి దృశ్య రూపాన్ని కల్పించి సామాజిక మాధ్యమంలో విడుదల చేశారు. ప్రముఖ వక్త శాంతారామ్ ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సంగీత కళాకారుడు భాగి కృష్ణమూర్తి సంగీత రూపకల్పన చేసి ఆలపించగా ఈ గీతాన్ని షేక్ బాబావలి దృశ్య రూప చిత్రంగా రూపొందించారు. అనంతరం రచయితల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ప్రముఖ రచయిత వడలి రాధాకృష్ణ, ప్రముఖ సాహితీ విమర్శకులు సజ్జా వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పోలాసం వీరాంజనేయులు, వెంకటరావు, ఆక్సీ, డాక్టర్ మేకల రాజు, మస్తాన్‌వలి, నాంచారయ్య, కృష్ణకిశోర్, ప్రత్తిపాటి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వరికపూడిసెలకు అన్ని అనుమతులూ సాధిస్తాం

వెల్దుర్తి: పల్నాడు ప్రజల చిరకాల వాంఛ వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులనూ సాధిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. సోమవారం మండలంలోని గుండ్లపాడు గ్రామంలో రూ. 25లక్షలతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని పిన్నెల్లి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏడు దశాబ్దాల నుంచి నిరీక్షిస్తున్న వరికపూడిసెల ఎత్తిపోతల నిర్మాణానికి నెల రోజులలోనే అనుమతులు తీసుకొచ్చేందుకు నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రివర్గం ఈ పథకం నిర్మాణానికి రూ.1273కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. గతంలో శ్రీశైలంలో పెరిక సామాజికవర్గ అన్నదాన సత్రం స్థలం కోసం ఎన్ని యత్నాలు జరిగినా ఫలితం లేకపోయిందని, సీఎం జగన్ ప్రభుత్వం ఏర్పడగానే సత్రం నిర్మాణం కోసం 50 సెంట్ల స్థలాన్ని మంజూరు చేయించి కమిటీ సభ్యులకు అప్పగించామని గుర్తుచేశారు. గుండ్లపాడు గ్రామస్తులకు నాలుగేళ్లలో రూ.20.61కోట్ల మేర ప్రయోజనం కల్పించామని, ఊరగుంట అభివృద్ధికి రూ.25లక్షలు మంజూరు చేయించామని పేర్కొన్నారు. రూ. 15లక్షలతో రైతులకు గోడౌన్‌ను నిర్మించేందుకు నిధులు విడుదలయ్యాయని వెల్లడించారు. గుండ్లపాడు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచ్‌గా తోట నారాయణ పదవీబాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా పనిచేసిన తోట వెంకయ్య దీర్ఘకాలిక సెలవుపై వెళ్లటంతో నారాయణను ఇన్‌చార్జి సర్పంచ్‌గా నియమించి ఎంపీడీఓ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు. ఎమ్మెల్యే పీఆర్కే పెద్దమనుషుల ఒప్పందాన్ని గౌరవించిన వెంకయ్యను, కొత్తగా బాధ్యతలు చేపట్టిన నారాయణను అభినందించి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మూడుజిల్లాల రీజినల్ కో– ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్య, జెడ్పీటీసీ కేతావత్ రూప్లీ బాలునాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, సర్పంచ్‌లు పిన్నెల్లి వెంకటరెడ్డి, రవీంద్రానాయక్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకూ సీఎం జగన్ సమన్యాయం

- చంద్రబాబుకు రాజకీయాల నుంచి నిష్క్రమణ తప్పదు
- ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా
- లాం గ్రామంలో అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్'


లాంలో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

లాం(తాడికొండ): అన్ని వర్గాలకూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమన్యాయం చేస్తున్నారని, అందుకే జగనన్నకు ప్రతి గడపా నీరాజనాలు పలుకుతోందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా చెప్పారు. తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ప్రతి ఇంటికీ కలిగిన మేలుల గురించి వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ అమలు చేసిన ఏకైక సీఎం సీఎం జగన్ అని కొనియాడారు. ఓట్ల కోసం టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని, విష ప్రచారంతో ప్రజలను రెచ్చగొట్టాలని చూస్తున్నారని, ఆయన ఎన్ని నాటకాలు ఆడినా ప్రజలు నమ్మబోరని, ఆయనకు ఆయన తనయునికి రాజకీయాల నుంచి నిష్క్రమణ తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, సచివాలయ కన్వీనర్లు ఇమ్మానియేలు, షేక్ నూర్జహాన్, షేక్ సాదిక్ పాల్గొన్నారు.